క్లుప్తంగా

వైభవంగా ఆడి ఉత్సవం



పుష్పాలంకరణలో అంకాళపరమేశ్వరి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం గుర్రప్పనాయుడు వీధిలోని అంకాళపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శుక్రవారం ఆడి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి ఉదయం అభిషేకం అనంతరం విశేష దీప ధూప హారతి, నైవేద్య సమర్పణ చేశారు.తర్వాత ఉత్సవమూర్తికి ప్రత్యేక పుష్పాలంకరణ చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

కట్టకిందపల్లెలో 'ఫ్యామిలీ డాక్టర్'



కట్టకిందపల్లెలో రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు

తవణంపల్లె: వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. శుక్రవారం మండలంలోని కట్టకిందపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. రోగులతోపాటు గర్భవతులు, బాలింతలకు, వృద్ధులకు, బీపీ, మధుమేహ వ్యాధిగ్రస్తులకు అవసరమైన పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేశారు. జ్వరాల బారిన పడితే ఆలస్యం చేయకుండా డాక్టర్‌ను సంప్రదించి చికిత్స పొందాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



తీవ్రంగా గాయపడ్డ అస్లాం బాషా (ఫైల్)

ఐరాల: రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలైన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం రాత్రి తిరుపతి రుయా ఆస్పత్రిలో మృతి చెందినట్లు ఎస్‌ఐ నరసింహులు తెలిపారు. ఎస్‌ఐ కథనం .. పుల్లిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లెకు చెందిన అస్లాంబాషా(41) చిత్తూరు నుంచి పీలేరుకు తన ద్విచక్రవాహనంలో వెళ్తుండగా ప్రమాదానికి గురయ్యాడు. చిత్తూరుకు చెందిన అల్లోఇన్ కారు పీలేరు నుంచి చిత్తూరుకు వస్తూ మండలంలోని గుండ్లపల్లె వద్ద వెళ్తున్న అస్లాం బాషా బైక్‌ను ఢీకొంది. ఆయన రోడ్డుపై పడడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడక. మృతుడి భార్య నగీన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈ స్పీడ్ బ్రేకర్లేందయ్యా సామీ..!

- వీధుల్లో ఇళ్ల ముందు ఇష్టారాజ్యంగా ఏర్పాటు
- అదుపుతప్పి గాయాలపాలవుతున్న వాహనదారులు
- తొలగించాలని స్థానికుల డిమాండ్



నరహరిపేట సమీపంలో వేసిన స్పీడ్‌బ్రేకర్



నంగమంగళంలో ఓ వీధిలో అనధికారికంగా వేసిన స్పీడ్‌బ్రేకర్

గుడిపాల: వాహనాల వేగానికి కళ్లెం వేసేందుకు ఏర్పాటు చేసిన స్పీడ్‌బ్రేకర్లు (వేగనిరోధకాలు) ప్రమాదాలకు దారితీస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా మండలంలో కొంతమంది ఇళ్ల ముందు ఇష్టారాజ్యంగా, ప్రమాణాలు పాటించకుండా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసుకోవడం వామనదారుల పాలిట శాపంగా మారాయి. ఎత్తుగా ఉండడంతో మోటార్ సైక్లిస్టులు ప్రధానంగా రాత్రి పూట ప్రమాదాల బారిన పడుతున్నారు. అంతేకాకుండా కొత్తగా ఆ మార్గాల్లో వచ్చే వారు సైతం అదుపు తప్పి గాయాలపాలవుతున్నారు.

రంగులేకపోవడమే ప్రమాదాలకు కారణం

సిమెంట్‌తో వేసిన స్పీడ్‌బ్రేకర్లకు తెలుపు, నలుపు రంగులతో పాటు రేడియం స్టిక్కర్లు వేయకపోవడంతో దగ్గరికి వచ్చే వరకు అవి కనిపించకపోవడంతో ప్రమాదాలకు తావిస్తున్నాయి. వీటి ధాటికి వాహనాలు కూడా దెబ్బతింటున్నాయి.

నిబంధనలు ఏం చెబుతున్నాయంటే..!

స్పీడ్ బ్రేకర్లు వాస్తవానికి స్కూల్‌జోన్ ప్రాంతాలు, రెండు లేదా నాలుగు లేన్ల రోడ్డు జంక్షన్ పాయింట్ల వద్ద, దేవాలయాలు, పాదచారులు రోడ్డు దాటేందుకు నిర్దేశించిన ప్రాంతాల సమీపంలో వాహనాలు వేగంగా రాకుండా నియంత్రించేందుకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తారు. అది కూడా పోలీసులు, పంచాయతీ అధికారుల సమన్వయంతో ఏయే ప్రాంతాల్లో ఏ పరిమాణంలో వేయాలో నిర్ణయిస్తారు. వాటిపై తెలుపు, నలుపు రంగులు వేయడంతో పాటు రేడియం స్టిక్కర్లు కూడా అతికిస్తారు. అందువల్ల అవి ప్రమాదాల నియంత్రణకు దోహదపడతాయి. కానీ ఇక్కడ పరిస్థితి పూర్తిగా భిన్నం.

అధికారులు స్పందించాలి



గుడిపాలలోని వీధుల్లో స్పీడ్‌బ్రేకర్ల రాకపోకలకు చాలా ఇబ్బందికరంగా ఉంది. రాత్రి సమయాల్లో ద్విచక్ర వాహనాలపై వస్తున్నప్పుడు స్పీడ్‌బ్రేకర్లు గుర్తించలేక అదుపుతప్పి కిందపడి గాయాల పాలవుతున్నాం. అనధికారికంగా వీటిని వేసిన వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలి. అలాగే స్పీడ్ బ్రేకర్లను తొలగించాలి.

–నాగరాజ్, గుడిపాల

గాయాలపాలవుతున్నాం



మండల వ్యాప్తంగా ప్రతి గ్రామంలో స్పీడ్‌బ్రేకర్లు అనధికారికంగా స్పీడ్‌బ్రేకర్లు ఎత్తుగా వేశారు. గుడిపాల, నరహరిపేట, నంగమంగళం, బొమ్మసముద్రం క్రాస్ వద్ద స్పీడ్ బ్రేకర్లు ఎక్కువగా ఉన్నాయి. నేను కూడా స్పీడ్ బ్రేకర్ల వల్ల అదుపుతప్పి కింద పడిపోయాను. అధికారులు వీటిని తొలగించాలి.

–రేణుకుమార్, నరహరిపేట

నోటీస్ బోర్డు

నేడు 'రామాయణ' ప్రదర్శన



మాట్లాడుతున్న నిర్వాహకులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): రామాయణ పౌరాణిక సౌండ్ అండ్ లైట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నటరాజ నాట్య కళా క్షేత్రం నిర్వాహకులు కోడికిశోర్ కోరారు. శుక్రవారం చిత్తూరు నగరం మిట్టూరులోని భజన గుడిలో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో శనివారం సాయంత్రం 6 గంటలకు రామాయణ ఇతిహాస గాథను, గ్రంథాన్ని దృశ్య రూపంలో ఆకట్టుకునేలా ప్రదర్శిస్తామన్నారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని వీక్షించాలని కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో శ్రీనివాసులు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు రాములగుడివీధిలోని శ్రీ జైన్ సంఘ ప్రార్థనా మందిరంలో ఆదివారం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు సుభాష్ జైన్ తెలిపారు. తిరుపతికి చెందిన అరవింద్ ఆస్పత్రి వైద్యులలు కంటి పరీక్షలు చేస్తారని, దీనిని నగరంతోపాటు పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పూతలపట్టు మండల కమిటీ నియామకం







రామచంద్రారెడ్డి, శ్రీనివాసులు, కామరాజు

కాణిపాకం: వైఎస్సార్‌సీపీ పూతలపట్టు మండల కమిటీని కేంద్ర పార్టీ కార్యాలయం శుక్రవారం ప్రకటించింది. మండల అధ్యక్షుడిగా శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా జయచంద్రారెడ్డి, దొరైరాజ్, ప్రధాన కార్యదర్శిగా రెడ్డెప్పరెడ్డి, మనోహర్, జయపాల్‌రెడ్డి, యువరాజ్, కార్యదర్శులుగా లక్ష్మీపతి, ఎంఎస్.ప్రసాద్‌రెడ్డి, పద్మనాభం, జగన్నాథరెడ్డి, రవికుమార్ రెడ్డి, సభ్యులుగా గోపి, ఏ.బాబు, వినోద్‌కుమార్, చిన్నబ్బ, ఉమాపతినాయుడు, సుధాకర్, మధుసూదన్‌బాబు, త్యాగరాజులు, బాబు, శివయ్య ఆచ్చారి, మల్లికార్జునరెడ్డి, లోకేశ్వరరెడ్డి, మహేంద్ర, వీరప్పను నియమించినట్లు కార్యాలయం వెల్లడించింది.

యాదమరి మండల కమిటీ..

యాదమరి: మండల వైఎస్సార్‌సీపీ నూతన కమిటీని కేంద్ర పార్టీ కార్యాలయం శుక్రవారం ప్రకటించింది. మండల అధ్యక్షుడిగా ధనంజయ్యరెడ్డి, ఉపాధ్యక్షులుగా రమేష్, కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఏఎం.బాబు, డిల్లయ్య, రాజేష్, హరీష్, కార్యదర్శులుగా చాణిక్య, హెన్రీ థామస్, జీ. సుబ్రమణ్యం, గురునాథరెడ్డి, కరుణాకర్, సభ్యులు వాసుదేవరెడ్డి, యేసుపితా, గజేంద్రన్, భక్తవత్సలం, వెంకటరమణ, విద్యాసాగర్, దేవేంద్రరెడ్డి, కోదండయాదవ్, సురేష్‌రెడ్డి, జగన్నాథరెడ్డి, మర్గాన్, జయవేల్, పద్మనాభన్, భూపతి, సెల్వం, పి.శేఖర్, రమేష్, వి.శేఖర్, మహ్మద్, మహేంద్రబాబు, మురుగ, జె.సుబ్రమణ్యం, నరసింహారెడ్డి, ఆజాద్, శ్రీకాంత్, ఇంతియాజ్, మురుగ, బాలాజీలను ప్రకటించింది.

బంగారుపాళెం మండల నూతన కమిటీ

బంగారుపాళెం: మండల వైఎస్సార్‌సీపీ నూతన కమిటీని నియమిస్తూ శుక్రవారం ఆ పార్టీ కేంద్ర కమిటీ ఆదేశాలు జారీ చేసింది. పార్టీ మండల అధ్యక్షుడిగా పాలేరు రామచంద్రారెడ్డి, ఉపాధ్యక్షులుగా శ్రీనివాసులు, కామరాజు, ప్రధాన కార్యదర్శులుగా కమలాపతిరెడ్డి, రవీంద్రనాథ్, ధనంజయరావు, లోకేష్, సాంబశివ, కార్యదర్శులుగా ముబారక్, భారతమ్మ, హరిబాబు, బాలాజీ, ఆనందరెడ్డి, సోమయాజులు, బాలాజీరెడ్డితో పాటు 40 మంది కార్యవర్గ సభ్యులుగా నియమించింది.

పోలీస్ స్టేషన్ తనిఖీ



పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ సాయినాథ్

గుడిపాల: పెండింగ్ కేసులు, నేరాలను త్వరిగతిన పరిష్కరించాలని డీఎస్పీ సాయినాథ్ ఆదేశించారు. శుక్రవారం గుడిపాల పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కోర్టులో ఉన్న వివిధ కేసులు, విచారణ ఎంత వరకు వచ్చిందో ఆరా తీశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సీఐ శ్రీధర్, ఎస్‌ఐ రామ్మోహన్, పోలీసులు పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లో ఆటోమేటిగ్గా మ్యుటేషన్

- ఆగస్టు 1 నుంచి చిత్తూరులో అమలు
- జిల్లా రిజిస్ట్రార్ రమణమూర్తి వెల్లడి



మాట్లాడుతున్న జిల్లా రిజిస్ట్రార్ రమణమూర్తి పక్కన కమిషనర్ నరసింహప్రసాద్

చిత్తూరు కార్పొరేషన్: ఇక కార్పొరేషన్ పరిధిలో ఆటోమేటిక్ మ్యుటేషన్లను చేయనున్నట్టు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ జిల్లా రిజిస్ట్రార్ రమణమూర్తి వెల్లడించారు. శుక్రవారం చిత్తూరు అర్బన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నగరపాలక కమిషనర్ నరసింహప్రసాద్‌తో కలిసి మ్యుటేషన్లపై డ్యాకుమెంట్ రైటర్లకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ, వ్యవసాయ భూముల్లాగే నగరపాలక సంస్థల పరిధిలోని ఇళ్లు, ప్లాట్లకూ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి కాగానే యజమాని పేరుతో ఆస్తి బదలాయింపు (మ్యుటేషన్) ఆటోమేటిగ్గా పూర్తవుతుందన్నారు. ఈ కొత్త విధానానికి ఆగస్టు 1 నుంచి జిల్లా కేంద్రంలో శ్రీకారం చుడుతున్నట్టు చెప్పారు. చిత్తూరు కార్పొరేషన్ పరిధిలోని ఆస్తులకు ఈ విధానం వర్తిస్తుందన్నారు. విజయవాడలో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ విధానం రాష్ట్రవ్యాప్తంగా నగరాలు, పట్టణాలకూ విస్తరించేందుకు శాఖ సిద్ధమైందన్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ కాగానే ఆ వివరాలు కార్పొరేషన్ అధికారులకు ఆన్‌లైన్‌లో తెలుస్తుందన్నారు. అక్కడ పరిశీలించి, ఓకే చెప్పగానే 'ఆటోమ్యుటేషన్ సర్టిఫికెట్' జనరేట్ అవుతుందన్నారు. ఈ ప్రక్రియ ముగిశాక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల ద్వారా కొత్త డాక్యుమెంట్లతో పాటు ఆస్తి బదలాయింపు పత్రం కూడా పొందేలా చర్యలు తీసుకుంటున్నరన్నారు. మార్కెట్ విలువ, విస్తీర్ణాన్ని బట్టి మ్యుటేషన్ చార్జీలు చెల్లించాలన్నారు. ఇంటి పన్ను బకాయిలు ఉంటే రిజిస్ట్రేషన్ స్లాట్ బుక్ అవదన్నారు. నగరపాలక కమిషనర్ నరసింహప్రసాద్ మాట్లాడుతూ, విక్రయదారులు సదరు ఇళ్లు, ప్లాట్ల ఆస్తిపన్ను బకాయిలు ఉంటే తప్పనిసరిగా చెల్లించాలన్నారు. అప్పుడే 'నో డ్యూస్' కింద గుర్తించి మ్యుటేషన్ చేస్తారన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్లు హేమంత్, విజయ్‌కుమార్, ఆర్వో గోపాలకృష్ణ, ఆర్‌ఐ అమరనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులకు భయపడేది లేదు

- ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు అక్రమం
- నల్లబ్యాడ్జీలతో వైఎస్సార్ సీపీ శ్రేణుల నిరసన



నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

చౌడేపల్లె: అక్రమ కేసులకు భయపడే ప్రసక్తే లేదని వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు స్పష్టం చేశారు. వారు శుక్రవారం నల్ల బ్యాడ్జీలు ధరించి రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి అక్రమ అరెస్ట్‌ను ఖండిస్తూ చౌడేపల్లె ప్రయివేటు బస్టాండు కూడలిలో ఉన్న దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.దామోదరరాజు, బోయకొండ ఆలయ మాజీ చైర్మన్ మిద్దింటి శంకర్ నారాయణ, మండల కన్వీనర్ నాగభూషణరెడ్డి, వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. మద్యం విక్రయాల్లో ఎక్కడా అవినీతి జరగకపోయినా కూటమి ప్రభుత్వం వైఎస్సార్ సీపీ నేతలపై తప్పుడు కేసులు నమోదు చేసి అరెస్టు చేస్తోందన్నారు. గత ప్రభుత్వం మద్యం పాలసీ పారదర్శకంగా అమలుచేసిందన్నారు. ప్రభుత్వం ఆధ్వర్యంలోనే మద్యం షాపులను కొనసాగించిన విషయాన్ని గుర్తు చేశారు. లేని స్కామ్‌ను సృష్టించి వైఎస్సార్ సీపీ నేతలను లక్ష్యంగా చేసుకుని భయభ్రాంతులకు గురిచేస్తోందని దుయ్యబట్టారు. మద్యం కేసులో ఎంపీ మిథున్‌రెడ్డి కడిగిన ముత్యంలా బయటకు వస్తారని చెప్పారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు ప్రజల పక్షాన పోరాటం చేస్తామన్నారు. ప్రజలు అన్ని విషయాలను గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో తగిన విధంగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నరసింహులు యాదవ్, మాజీ ఎంపీపీ అంజిబాబు, రుక్మిణమ్మ, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు మిద్దింటి కిషోర్‌బాబు, పద్మనాభరెడ్డి, చెంగారెడ్డి, వెంకటమణ, లడ్డూ రమణ, రమేష్ బాబు, మునికృష్ణమ నాయుడు, బీఎస్ రెడ్డి, కళ్యాణ్‌భరత్, శ్రీరాములు, లక్ష్మీనర్సయ్య, ఆల్తాఫ్, షంషీర్, బ్రహ్మానందరెడ్డి, వెంకటరెడ్డి, ఓబులేసు, శ్రీనివాసులు, గంగిరెడ్డి, జయచంద్ర, పవన్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల ఆందోళన



గాంధీవిగ్రహం ఎదుట ఆందోళన చేస్తున్న ఫోరం ఆఫ్ సివిల్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: పింఛన్ నియమాలు–2025 బిల్లులో చేసిన సవరణల్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని ఫోరం ఆఫ్ సివిల్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. తమ డిమాండ్లపై శుక్రవారం తపాలా, బీఎస్ఎన్ఎల్ కార్యాలయాల ఎదుట ఆందోళన చేశారు. అనంతరం ర్యాలీగా గాంధీవిగ్రహం వద్దకు వెళ్లి, వినతిపత్రం అందజేసి, మానవహారం ఏర్పాటు చేసి నిరసన వ్యక్తం చేశారు. నాయకులు మాట్లాడుతూ, పింఛనర్ల సంక్షేమానికి విఘాతంగా మారిన వ్యాలిడేషన్ చట్టాన్ని రద్దు చేయాలన్నారు. వెంటనే 8వ కేంద్ర వేతన సంఘం చైర్మన్‌ను త్వరగా నామినేట్ చేసి, నిబంధనలను ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో తపాలా, రైల్వే, బీఎస్ఎన్ఎల్, ఆర్ఎంఎస్ విశ్రాంత ఉద్యోగ సంఘాల నాయకులు సౌందర్‌రాజన్, రవిచంద్రన్, ఉమాపతి, సుధాకర్‌నాయుడు, రామచంద్రనాయుడు, దేవరాజులు, సుకుమార్, రమణ, చక్రవర్తి, శ్రీనివాసయ్య, రాధాకృష్ణమూర్తి, భాస్కర్, సర్దార్ పాల్గొన్నారు.

ఆక్సిజన్ కనెక్షన్ ఎప్పుడిస్తారు సారూ..?

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం స్థానిక ఏరియా ఆస్పత్రిని వంద పడకలుగా మార్చింది. అందుకు తగిన వసతులు కల్పించేందుకు భవన నిర్మాణాన్ని సైతం చేపట్టింది. ఇంతలో ఎన్నికలు వచ్చి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఈ ఏడాది మార్చిలో నూతన భవనాన్ని ప్రారంభించింది. ప్రత్యేక వార్డు సౌకర్యాలు కల్పించాల్సి వున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా ఇన్‌పేషెంట్ల బెడ్లకు ఆక్సిజన్ కనెక్షన్ ఇవ్వలేదు. దీంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు.

- ఆక్సిజన్ ప్లాంట్ ఉన్నా పనిచేయని ప్రెజర్ స్వింగ్ ఎడ్సోర్షన్ (పీఎస్ఏ)
- పెండింగ్‌లోనే మేజర్, మైనర్ రిక్వైర్‌మెంట్స్ ప్రతిపాదనలు
- గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన కోవిడ్ వార్డే దిక్కు



పలమనేరు వంద పడకల ఏరియా ఆస్పత్రి



30 బెడ్లకు ఆక్సిజన్ అందించే ఎల్ఎంఓ ట్యాంకు

పలమనేరు: పలమనేరు పట్టణంలోని ఏరియా ఆస్పత్రిని చూసిన వారు ఎవరైనా ఆశ్చర్యం వ్యక్తం చేయాల్సిందే. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాడు–నేడు కింద రూ.16 కోట్లతో ఈ ఆస్పత్రిని అభివృద్ధి చేసింది. ఆస్పత్రి స్థాయిని వంద పడకలకు చేసింది. అంతేగాక ఏపీ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఎంఎస్ కేఎంవీ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ కొత్త భవన నిర్మాణాన్ని చేపట్టింది. పాత ఆస్పత్రిలో ఐదు బ్లాకులు వుండగా కొత్త ఆస్పత్రిలో అదనంగా మరో ఐదు బ్లాకులు ఏర్పాటు చేశారు. 50 మందికి ఆక్సిజన్ అందించేలా ప్లాంట్‌ను ఏర్పాటుచేసింది. పనులు పూర్తయి ఈ ఏడాది మార్చి 7న కొత్త భవనాన్ని అధికారులు ప్రారంభించి వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఇంకా పలు పనులు చేపట్టాల్సి వున్నా ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. ముఖ్యంగా 50 బెడ్లకు ఆక్సిజన్ అందించే పైపులైన్ అమర్చలేదు. ఆక్సిజన్ ప్లాంట్ ఉన్నా లైనింగ్ సౌకర్యాన్ని కల్పించలేదు. మరోవైపు గాలి ద్వారా ఆక్సిజన్‌ను తయారు చేసేందుకు పీఎస్ఏ(ప్రెజర్ స్వింగ్ ఎడ్సోర్షన్) యంత్రం ఉన్నా వినియోగించడం లేదు. ప్రస్తుతం ఆక్సిజన్ సిలిండర్‌ను ఎల్ఎంవో ప్లాంట్‌లో నింపి దాని నుంచి బెడ్లలో వున్న పేషెంట్లకు ఆక్సిజన్ అందిస్తున్నారు.

వెంటనే రూ.45 లక్షలు కావాల్సిందే

కోవిడ్ మహమ్మారి ప్రపంచాన్ని వణించిన విషయం తెలిసిందే. ఆ సమయంలో గత ప్రభుత్వం పలమనేరు ఆస్పత్రిలో 30 బెడ్లతో కోవిడ్ వార్డును ఏర్పాటుచేసింది. ఎంతో మంది ప్రాణాలను కాపాడింది. ఇప్పుడు కరోనా లాంటి కొత్త వైరస్‌లు వచ్చే అవకాశం ఉందని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఏరియా ఆస్పత్రి పూర్తిస్థాయిలో ఏర్పాట్లు లేవనే సమాధానం వినిపిస్తోంది. వైరస్‌ను గుర్తించేందుకు అవసరమైన టెస్టింగ్ ల్యాబ్‌లు లేవు. కొత్త ఆస్పత్రిలో ప్రత్యేక వార్డు సౌకర్యాలు కల్పించలేదు. కృత్రిమ శ్వాసను అందించేందుకు గత ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఆక్సిజన్ ప్లాంట్ నుంచి పాత ఆస్పత్రిలోని ఐదు బెడ్లకు మాత్రమే ఆక్సిజన్ సౌకర్యం ఉంది. మిగిలిన 25 బెడ్లకు కనెక్షన్ ఇవ్వలేదు. మరోవైపు కొత్తగా నిర్మించిన బెడ్లలో ఇన్ పేషెంట్లకు సైతం ఆక్సిజన్ లైనింగ్ ఏర్పాటుచేయలేదు. గాలినుంచి ఆక్సిజన్‌ను ఇక్కడే తయారు చేసే యంత్రం రిపేరులో ఉందని, దీని మరమ్మ తుల కోసం ఇటీవల రూ.45 లక్షల అంచనాలతో జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపినట్టు అధికారులు చెబుతున్నారు. తాజాగా కుప్పానికి వచ్చిన సీఎం చంద్రబాబు మాత్రం అన్ని ఆస్పత్రుల్లోనూ చైనా వైరస్‌ను ఎదుర్కొనేందుకు ప్రత్యేక బెడ్లు సిద్ధంగా ఉన్నాయని చెప్పడం కొసమెరుపు.





గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఆక్సిజన్ యూనిట్, ఎలుకలు కొట్టేసి పనిచేయకుండా పోయిన యంత్రం

ఇప్పటికిప్పుడు భయపడాల్సిన పనిలేదు



కొత్త వైరస్ వస్తుందన్న ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఇప్పటికిప్పుడు భయపడాల్సిన పనిలేదు. గత ప్రభుత్వం ఏర్పాటు చేసినా ఆక్సిజన్ ప్లాంట్ నుంచి ఆక్సిజన్‌ను ఇన్ పేషెంట్లకు పెట్టేందుకు ఇంకా లైనింగ్ చేయలేదు. అదేవిధంగా ఇక్కడే ఆక్సిజన్ తయారు చేసే పరికరం వైరింగ్‌ను ఎలుకలు కట్ చేయడంతో అది పనిచేయడం లేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశాం. అలాగే మేజర్, మైనర్ రిక్వైర్‌మెంట్స్ కోసం రూ.45 లక్షలు అవసరమని కలెక్టర్‌కు నివేదిక ఇచ్చాం.

–డాక్టర్ మమతారాణి, ఆస్పత్రి సూపరింటెండెంట్, పలమనేరు

శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు



అమ్మవారు

చౌడేపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం రాహుకాల అభిషేకాలు, పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రావణ మాసపు తొలి శుక్రవారం కావడంతో అమ్మవారిని ప్రత్యేకంగా బంగారు ఆభరణాలు, పూలతో అలంకరించారు. మహిళలు ఉపవాస దీక్షలతో ఆలయం వద్దకు చేరుకుని పూజలు చేశారు. రాహుకాల అభిషేక పూజల్లో పాల్గొన్న ఉభయదారులకు అధికారులు, వేద పండితులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయం ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులతో కిటకిటలాడింది.

